18 మంది మావోయిస్టుల లొంగుబాటు

వారిపై రూ.38 లక్షల రివార్డు ఉన్నట్లు వెల్లడి

ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుక్మా జిల్లా ఎస్పీ కిరణ్ చవాన్

లొంగిపోయిన మావోయిస్టుల వివరాలు వెల్లడిస్తున్న సుక్మా జిల్లా ఎస్పీ కిరణ్ చవాన్

కొత్తగూడెం ప్రగతి మైదాన్, మే 27 : మావోయిస్టు పార్టీకి చెందిన నలుగురు హార్డ్ కోర్ మావోయిస్టులు సహా 18 మంది మావోయిస్టులు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుక్మా జిల్లా ఎస్పీ కిరణ్ చవాన్ ఎదుట లొంగిపోయారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఎస్పీ మంగళవారం మీడియా సమావేశంలో వెల్లడించారు. పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ (పీఎల్‌జీఏ) 1వ బెటాలియన్‌లో కీలకంగా వ్యవహరిస్తున్న నలుగురు మావోయిస్టులతో సహా 18 మంది మావోయిస్టులు లొంగిపోయారని, వారిపై రూ.39 లక్షల రివార్డు ఉన్నట్లు ధ్రువీకరించారు. వీరంతా ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం ఆధ్వర్యంలో జిల్లా పోలీసులు నిర్వహిస్తున్న 'నియద్ నెల్లనార్' కార్యక్రమానికి ఆకర్షితులై లొంగిపోయినట్లు పేర్కొన్నారు. వీరిలో 1వ బెటాలియన్‌కి చెందిన నలుగురు మావోయిస్టులు గతంలో జరిగిన అనేక విధ్వంసకర ఘటనల్లో పాల్గొన్నట్లు ఎస్పీ వివరించారు.

ఆర్థిక ఇబ్బందులతో ఆటో డ్రైవర్ ఆత్మహత్య

దుర్గాప్రసాద్ పాసి(ఫైల్)

ఇల్లెందు, మే 27 : ఆర్థిక ఇబ్బందులతో ఓ ఆటో డ్రైవర్ పురుగుల మందుతాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన ఇల్లెందు పట్టణంలోని ఆర్‌అండ్‌ఆర్ కాలనీ సమీపంలో మంగళవారం సాయంత్రం చోటు చేసుకుంది. సీఐ బత్తుల సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. ఇల్లెందు పట్టణంలోని 14వ నెంబర్ బస్తీకి చెందిన దుర్గాప్రసాద్(రాజేందర్) పాసి(45) జగదాంబ సెంటర్ అడ్డాలో ఆటో నడుపుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉండగా.. వారిలో ఒక కుమార్తె పెళ్లి చేశాడు. ఈ క్రమంలో ఆటో సరిగ్గా నడవకపోవడం, కూతురు పెళ్లి చేయడంతో ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నాడు. దీంతో తీవ్ర మనోవేదనకు గురైన దుర్గాప్రసాద్ మంగళవారం ఉదయం ఇంటి నుంచి ఆటో తీసుకొని వెళ్లాడు. రాత్రి 8 గంటల ప్రాంతంలో ఆర్‌అండ్‌ఆర్ కాలనీ సమీపంలో పురుగుల మందుతాగి మృతిచెందినట్లు స్థానికులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతుడి భార్య మీనాక్షి పాసి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. కాగా.. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ఉచిత బస్సుల వల్ల ఆటోలు సరిగా నడవకపోవడం.. ఆర్థిక సమస్యలు తలెత్తడంతో దర్గాప్రసాద్ బలవన్మరణానికి పాల్పడినట్లు ఆటో యూనియన్ నాయకులు ఆరోపించారు. ఆయన కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

ఆదివాసీ గ్రామాన్ని సందర్శించిన మలేరియా అధికారి

ఆదివాసీలతో మాట్లాడుతున్న జోనల్ మలేరియా అధికారి సునీల్‌కుమార్

పర్ణశాల/దుమ్ముగూడెం, మే 27: దుమ్ముగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని పెద్ద కమలాపురం గ్రామాన్ని సోమవారం రాత్రి జోనల్ మలేరియా అధికారి డాక్టర్ సునీల్ కుమార్ తన టీంతో కలిసి సందర్శించారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి వెళ్లి వచ్చిన పెద్ద కమలాపురం గ్రామానికి చెందిన కంగాల రాంబాబు మలేరియా జ్వరంతో బాధపడుతున్న ఆయన ఇంటిని సందర్శించి ఇంట్లో వారితో మాట్లాడారు. ఆస్పత్రిలో చికిత్స తీసుకుంటున్న రాంబాబు ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. జోనల్ మలేరియా ఆఫీసర్ మాట్లాడుతూ.. జ్వరం వస్తే గవర్నమెంట్ ఆస్పత్రికి వెళ్లి పరీక్షలు చేయించుకోవాలని, మూఢ నమ్మకాలతో దేవర్ల దగ్గరికి వెళ్లకూడదని అన్నారు. అసిస్టెంట్ డైరెక్టర్ నాగయ్య, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రుక్మాకర్‌రెడ్డి, ఏఎంవో కుమార్‌స్వామి, హెచ్‌ఈవో అజయ్‌కుమార్, సబ్ యూనిట్ ఆఫీసర్లు జేతురాం, ధర్మారావు, హెల్త్ సూపర్‌వైజర్ సాగర్, ల్యాబ్ టెక్నీషియన్ మురళి, మలేరియా టెక్నికల్ సూపర్‌వైజర్ రామకృష్ణ, హెల్త్ సిబ్బంది పాల్గొన్నారు.

23 లీటర్ల నాటుసారా పట్టివేత

భద్రాచలం, మే 27: భద్రాచలంలోని ఎక్సైజ్ చెక్‌పోస్టు వద్ద మంగళవారం 23 లీటర్ల నాటుసారాయిను ద్విచక్ర వాహనంపై తరలిస్తుండగా బోడా నితిన్ అనే వ్యక్తిని అరెస్టు చేసినట్లు సీఐ సీహెచ్ శ్రీనివాస్ తెలిపారు. బూర్గంపాడు మండలం సారపాకకు చెందిన నితిన్ ఏపీలోని గుండువారిగూడెం గ్రామం నుంచి నాటుసారాయిను బైక్‌పై తరలిస్తుండగా సమాచారం అందుకున్న ఎన్‌ఫోర్సుమెంటు అధికారులు పట్టుకున్నారు. ఈ దాడుల్లో కరీం, బాలు, సుదీర్, హనుమంతరావు, ఉపేందర్ పాల్గొన్నారు.

వ్యాధుల కాలం.. అప్రమత్తం అవసరం

కలెక్టర్ జితేష్ వి పాటిల్

మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

భద్రాద్రి కొత్తగూడెం, మే 27 (నమస్తే తెలంగాణ): ''వర్షాకాలమంటేనే వ్యాధుల సీజన్. వీటి నియంత్రణకు అన్ని ముందస్తు చర్యలు తీసుకోవాలి'' అని అధికారులను కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఆదేశించారు. ఆయన వారితో మంగళవారం ఐడీవోసీ కార్యాలయ హాల్‌లో సమావేశమయ్యారు. వానాకాలంలో మలేరియా, ఫైలేరియా, మెదడువాపు, డెంగీ, చికున్‌గున్యా, టైఫాయిడ్, డయేరియా, అతిసార తదితర వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని అన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే వ్యాధులను అరికట్టవచ్చన్న విషయాన్ని ప్రజలకు వివరించాలన్నారు. జిల్లావ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి, వివరాలను రిజిస్టర్‌లో నమోదు చేయాలని చెప్పారు. అస్వస్థులైన విద్యార్థులకు వైద్యం అందించాలన్నారు. వసతి గృహాల్లో కిచెన్ షెడ్లను, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ట్రైబల్ వెల్ఫేర్ డీడీ మణెమ్మ, డీఎంహెచ్‌వో డాక్టర్ భాస్కర్ నాయక్, డీసీహెచ్‌వో డాక్టర్ రవిబాబు, డీఈవో వెంకటేశ్వర చారి, జిల్లా మలేరియా నివారణ అధికారి స్పందన, జిల్లా పంచాయతీ అధికారి సుజాత, బీసీ సంక్షేమాధికారి ఇందిర, పాల్వంచ మున్సిపల్ కమిషనర్ సుజాత, మిషన్ భగీరథ ఈఈలు తిరుమలేష్, నళిని, జిల్లా అదనపు వైద్యారోగ్య శాఖాధికారి జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అటవీ అధికారులకు అత్యుత్సాహం ఎందుకు

బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా

ఘటనా స్థలంలో మాట్లాడుతున్న రేగా కాంతారావు

మణుగూరు టౌన్, మే 27: మణుగూరు మండలం కట్టుమలార గ్రామంలో పోడుభూముల విషయంలో రెండు వర్గాల మధ్య వివాదం చోటు చేసుకుంది. పరిష్కరించే క్రమంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు కట్టుమల్లారం చేరుకున్నారు. ప్రభుత్వం ఇచ్చిన భూమి కంటే అధనంగా అడవిని కొట్టారని అటవీ అధికారులు వచ్చి సాగుదారులను అడ్డుకొని ట్రాక్టర్లను నిలిపివేశారు. దీంతో కట్టుమల్లారం గ్రామం గిరిజన కుటుంబాల్లో బీఆర్ఎస్, కాంగ్రెస్ మధ్య పోడు భూమి గొడవలు నెలకొన్నాయి. నాడు కట్టుమల్లారంలో ఒప్పందం కుదుర్చుకున్న ప్రకారం పోడు భూమి రాకపోవడంతో పరిష్కరించేందుకు ఘటనా స్థలానికి విచ్చేసిన రేగా కాంతారావును కాంగ్రెస్ వర్గీయులు, అధికారులు ప్రశ్నించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. కేసీఆర్ ప్రభుత్వం పోడు రైతులందరికీ పోడు పట్టాలు ఇచ్చామని గుర్తు చేశారు. పినపాక నియోజకవర్గంలో 70 వేల ఎకరాల వరకు పట్టాలు ఇప్పించామన్నారు. అప్పుడు అటవీ అధికారులు, రెవెన్యూ అధికారుల కో ఆర్డినేషన్ లోపంతో నేడు రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. గ్రామాల్లో జరిగిన పొరపాట్లను సరిచేసేందుకు తాము ప్రయత్నిస్తున్నామన్నారు. అధికారులు అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారని, అటవీ అధికారులకు మరలా ఇలాంటి ఘటనలకు పాల్పడితే శంకరగిరి మాన్యాలే అంటూ హెచ్చరించారు.

కాంగ్రెస్ పార్టీ గూండాల దాడి దుర్మార్గం

బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు

మణుగూరు టౌన్, మే 27: సిరిసిల్లలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంపై కాంగ్రెస్ పార్టీ గూండాల దాడి దుర్మార్గం, అప్రజాస్వామికమని, ఈ దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు అన్నారు. ఈ దాడి ప్రజాస్వామ్య విలువకు, శాంతి భద్రతలకు విరుద్ధంగా ఉందని, ప్రభుత్వ అధికారిక కార్యక్రమాల్లో స్థానిక ఎమ్మెల్యే ఫొటో ఏర్పాటు చేయకపోవడాన్ని ప్రశ్నించినందుకు బీఆర్ఎస్ నాయకులపై కాంగ్రెస్ నేతలు దాడికి దిగడం హేయమైన చర్య అని అన్నారు. ఈ ఘటనలో గాయపడిన బీఆర్ఎస్ కార్యకర్తలకు మెరుగైన వైద్యం అందించాలని, పోలీసుల లాఠీచార్జిను ఖండిస్తున్నామని, దాడికి పాల్పడిన కాంగ్రెస్ గుండాలపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఓసీ విస్తరణకు మేం వ్యతిరేకం కాదు

సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అయోధ్య

మాట్లాడుతున్న అయోధ్య

మణుగూరు టౌన్, మే 27: సింగరేణి అధికారులకు బొగ్గు ఉత్పత్తి లాభాల వాటా తప్ప ప్రజల ప్రాణాలు, ఆస్తులను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వ అధికారులు, సింగరేణికి లేదా అని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అయోధ్య ప్రశ్నించారు. మంగళవారం మణుగూరులోని సీపీఐ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ఎందుకు త్వరగా భూ సేకరణ చేస్తుందో అర్థం కావడం లేదని, ఓసీ విస్తరణలో భాగంగా రాజుపేట, విఠల్‌రావు నగర్ గ్రామాలకు సుమారు 35 మీటర్ల దూరంలోనే ఈ పనులు కొనసాగుతున్నాయని, ఇవి కొనసాగితే ఈ ప్రాంత ప్రజలు అక్కడ నివసించే పరిస్థితి ఉండదని అన్నారు. కలెక్టర్, సంబంధిత అధికారులు దీనిపై దృష్టి సారించి ప్రజలకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో సరెడ్డి పుల్లారెడ్డి, మున్నా లక్ష్మీకుమారి, దుర్గ్యాల సుధాకర్, బాడి సతీష్, సోందే కుటుంబరావు, గడ్డం వెంకటేశ్వర్లు, కొత్తపల్లి సీతారాములు, నెమ్మళ్ల ఉపేందర్ పాల్గొన్నారు.

తెలుగు మాధుర్యాన్ని పిల్లలకు అందించాలి

మాట్లాడుతున్న నాగరాజశేఖర్

కొత్తగూడెం గణేష్ టెంపుల్, మే 27: తెలుగు భాష మాధుర్యాన్ని పిల్లలకు అందించి, ఈ భాషపై వారిలో మక్కువ పెంచాల్సిన బాధ్యత తెలుగు ఉపాధ్యాయులపై ఉందని జిల్లా అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ నాగరాజశేఖర్ అన్నారు. జిల్లాలోని తెలుగు ఉపాధ్యాయులకు కొత్తగూడెంలోగల జిల్లా విద్య శిక్షణ కేంద్రంలో చివరి విడత వృత్యంతర శిక్షణ శిబిరం కొనసాగుతున్నది. దీనిని ఆయన మంగళవారం సందర్శించి మాట్లాడారు. ఆంగ్ల మాధ్యమ ఒరవడిలో తెలుగు భాష కనుమరుగయ్యే ప్రమాదముందని ఆందోళన వ్యక్తం చేశారు. దీనిని సమర్థవంతంగా ఎదుర్కోవాలన్నారు. ఇందుకోసం పిల్లలకు తెలుగులో కథలు చెప్పాలని, పద్యాలు వినిపించాలని, వాటిని వారితో రాయించాలని సూచించారు. ఇలా పిల్లల్లో సృజనాత్మకత పెంచాల్సిన బాధ్యత తెలుగు ఉపాధ్యాయులదేనని అన్నారు. శిక్షణ కేంద్రం ఇన్‌చార్జ్ నీరజ, రాష్ట్ర పరిశీలకుడు మడత భాస్కర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వేపలగడ్డలో చోరీ

వివరాలు సేకరిస్తున్న పోలీసులు

కొత్తగూడెం టౌన్, మే 27: సుజాతనగర్ మండలం వేపలగడ్డ గ్రామం తులసిరెడ్డి పెట్రోల్ బంక్ సమీపం లోగల బాల చెన్నారెడ్డి ఇంట్లో చోరీ జరిగింది. ఆయన తెలిపిన వివరాలు.. బాల చెన్నారెడ్డి, తన కుటుంబంతో కలిసి ఆదివారం భద్రాచలం ఏరియా వద్దనున్న జామాయిల్ నర్సరీకి వెళ్లారు. మంగళవారం ఉదయం ఇంటికి తిరిగొచ్చేసరికి సింహద్వారం తలుపు తాళం పగలగొట్టి ఉంది. వెంటనే పోలీసులకు సమాచారమిచ్చారు. బ్యాంకులో వేసేందుకని ఇంట్లో పెట్టిన రూ.1.50 లక్షలు కనిపించలేదు. కేసును ఎస్సై రమాదేవి దర్యాప్తు చేస్తున్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు

ఇల్లెందు రూరల్, మే 27: సింగరేణి కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని ఇల్లెందు ఏరియా జీఎం కృష్ణయ్య అన్నారు. గుర్తింపు సంఘం ప్రతినిధులతో ఆయన మంగళవారం తన కార్యాలయంలో నెలవారీ సమావేశం నిర్వహించారు. కార్మికుల సమస్యలను తెలుసుకున్నారు. వాటిని పరిష్కారానికి హామీ ఇచ్చారు. జీఎం రామస్వామి, గోవిందరావు, నరసింహరాజు, మోహన్‌రావు, రవికుమార్, నాగరాజు నాయక్ పాల్గొన్నారు.

అడ్‌హక్ ప్రాతిపదికన టీచర్ల నియామకాలు

ఇల్లెందు రూరల్, మే 27: అడ్‌హక్ ప్రాతిపదికన టీచర్ల నియామకాలు చేపట్టనున్నట్లు సింగరేణి కాలరీస్ ఎయిడెడ్ హైస్కూల్ కరస్పాండెంట్ సుధాకర్ తెలిపారు. ఈ నియాయక పరీక్ష పేపర్‌ను మంగళవారం పాఠశాలలో ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ.. 2025-26 అడహక్ సంవత్సరానికి 13 మంది టీచర్లను తీసుకోనున్నట్లు చెప్పారు. 54 మంది దరఖాస్తు చేశారని, పరీక్షకు మాత్రం 47 మంది హాజరయ్యారని తెలిపారు. ఉత్తీర్ణత సాధించిన వారికి ఈ నెల 29న డెమో క్లాసులు ఉంటాయన్నారు.

రోస్టర్ రిజిస్టర్ల తనిఖీ

కొత్తగూడెం సింగరేణి, మే 27: సింగరేణి కొత్తగూడెం ప్రధాన కార్యాలయం ఈఈ సెల్‌ను మంగళవారం సింగరేణి ఎస్టీ ఉద్యోగులు, చీఫ్ లైజన్ ఆఫీసర్ బృందం పరిశీలించింది. ఎస్టీ అధికారుల ఉద్యోగోన్నతులకు సంబంధించిన రూల్ ఆఫ్ రిజర్వేషన్ రోస్టర్ రిజిస్టర్లను తనిఖీ చేసింది. ఈఈ సెల్ ఇన్‌చార్జ్/ఏజీఎం మురళీధర్‌రావు, చీఫ్ లైజన్ ఆఫీసర్/జీఎం వీసం కృష్ణయ్య, ఎస్టీ అసోసియేషన్ అధ్యక్షుడు భాస్కర్‌రావు, జనరల్ సెక్రటరీ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఈదురు గాలులకు కూలిన ఇల్లు

కూలిన ఇంటి వద్ద కుటుంబీకులు

టేకులపల్లి, మే 27: ఈదురు గాలులతో రేకుల ఇల్లు కూలింది. మండలంలోని తవుర్యాతండా పంచాయతీ స్టేషన్ తడికలపూడి గ్రామానికి చెందిన ఉప్పల సావిత్రి-ఏకాంబరం దంపతుల రేకుల ఇల్లు.. మంగళవారం మధ్యాహ్నం బలమైన ఈదురు గాలులతో కూలింది. వ్యవసాయ కూలీలుగా పనిచేస్తున్న ఆ దంపతులు, కుటుంబీకులు నిరాశ్రయులయ్యారు.

విద్యుదాఘాతంతో దుక్కిటెద్దు మృతి

టేకులపల్లి, మే 27: విద్యుదాఘాతంతో దుక్కిటెద్దు మృతి చెందింది. దాని యజమాని తెలిపిన వివరాలు.. మండలంలోని బద్దుతండా గ్రామస్తుడు ఇస్లావత్ కేస్లీకి చెందిన దుక్కిటెద్దు మంగళవార మేతకు వెళ్లింది. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఎర్త్ వైర్‌కు తగలడం, దానికి విద్యుత్ ప్రసరిస్తుండడంతో షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందింది.

రౌడీ షీటర్లకు కౌన్సిలింగ్

పాల్వంచ రూరల్, మే 27: రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీ షీటర్లకు డీఎస్పీ సతీష్‌కుమార్ మంగళవారం స్టేషన్‌లో కౌన్సిలింగ్ ఇచ్చారు. రికార్డులను పరిశీలించి, కేసుల వివరాలను సీఐ సీఐ సతీష్, ఎస్సై సురేష్ నుంచి తెలుసుకున్నారు.

గైర్హాజరు కార్మికులకు కౌన్సిలింగ్

కౌన్సిలింగ్ నిర్వహిస్తున్న అధికారులు

రామవరం, మే 27: సింగరేణి కొత్తగూడెం ఏరియాలోని జేవీఆర్ సీహెచ్‌పీలో గైర్హాజరు కార్మికులకు జీఎం శాలెంరాజు మంగళవారం కౌన్సిలింగ్ నిర్వహించారు. జనవరి నుంచి మే నెల వరకు 60 మస్టర్లు, అంతకన్నా తక్కువ చేసిన కార్మికులకు వారి కుటుంబ సభ్యుల సమక్షంలోనే కౌన్సిలింగ్ ఇచ్చారు. అధికారులు సూర్యనారాయణరాజు, శివకేశవరావు, డాక్టర్ నరసింహారావు, సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రూ.కోటి బీమాకు వినతి

పాల్వంచ, మే 27: యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(యూబీఐ)లో ఖాతా ఉన్న ట్రాన్స్‌కో, జెన్‌కో, ఎస్‌పీడీసీఎల్ కార్మికులకు, ఉద్యోగులకు, ఆర్టీజన్లకు కోటి రూపాయల ప్రమాద బీమా వర్తింపజేయాలని కోరుతూ యూబీఐ చీఫ్ మేనేజర్‌కు తెలంగాణ రాష్ట్ర విద్యుత్ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, జెన్‌కో కార్యదర్శి చారుగుండ్ల రమేష్ మంగళవారం వినతిపత్రం ఇచ్చారు. నాయకులు సందుపట్ల శ్రీనివాసరెడ్డి, ధర్మపురి నాగేశ్వరరావు, ఎండీ అమీన్, దెంచనాల రాంబాబు, నారందాసు వెంకటేశ్వర్లు, కురిమెళ్ల రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

బీటెక్‌లో ప్రవేశానికి దరఖాస్తుల స్వీకరణ

ఇల్లెందు రూరల్, మే 27: కొత్తగూడెంలోని యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్‌లో బీటెక్‌లో ప్రవేశానికి సింగరేణీయుల పిల్లల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఇల్లెందు ఏరియా జీఎం కృష్ణయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్‌సెట్ ర్యాంక్ ఆధారంగా ఎంపిక ఉంటుందని పేర్కొన్నారు. దరఖాస్తు చేసేందుకు జూలై 14వ తేదీ వరకు గడువు ఉందని తెలపారు.

రామయ్యకు వైభవంగా కల్యాణం

నిత్యకల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

భద్రాచలం, మే 27: భద్రాచలంలోని సీతారామచంద్ర స్వామి వారి ఆలయంలో ఉన్న దాసాంజనేయస్వామి వారి ఆలయంలో మంగళవారం సందర్భంగా అర్చకులు తమలపాకులతో ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. అలాగే నిత్యకల్యాణ మండపంలో స్వామివారి నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, కంకణదారణ, జీలకర్రబెల్లం, మాంగల్యదారణ, వేద ఆశీర్వచనంను వైదిక సిబ్బంది నిర్వహించారు. కల్యాణంలో పాల్గొన్న దంపతులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

నేటి రామాలయం పరిసరాల్లో కూల్చివేతలు ప్రారంభం

భద్రాచలం, మే 27: భద్రాచలంలోని రామాలయ పరిసరాల్లో భూ సేకరణ కోసం నష్టపరిహారం అందుకున్న పలువురు నిర్వాసితులు ఖాళీ చేసిన ఇళ్లను నేటి నుంచి కూల్చివేతలను రెవెన్యూ అధికారులు ప్రారంభించనున్నారు. ఇప్పటికే ఆలయ పడమర మెట్ల వైపు ఉన్న పలు దుకాణదారులు తమ ఇళ్లను ఖాళీ చేసి వెళ్లిపోయారు. తూర్పుమెట్ల వైపు ఉన్న షాపులను సైతం చాలా మంది ఖాళీ చేసే పనిలో నిమగ్నమయ్యారు. ఇప్పటికే ప్రభుత్వం రామాలయ అభివృద్ధికి భూ సేకరణ కోసం రూ.34.60 కోట్ల కేటాయించగా, అందులో 34 మందికి నష్టపరిహారం చెక్కులను అందజేశారు. ఎనిమిది మంది మాత్రం నష్టపరిహారం చెక్కులను తీసుకునేందుకు నిరాకరించి కోర్టును ఆశ్రయించినట్లు సమాచారం. భూమిని పూర్తిగా సేకరించాలని రెవెన్యూ అధికారులు నిర్ణయించారు.

బీఆర్ఎస్ యూత్ మండల అధ్యక్షుడిగా చెన్నకేశవులు

చెన్నకేశవులను అభినందిస్తున్న రేగా

పినపాక, మే 27: బీఆర్ఎస్ యువజన విభాగం మండల అధ్యక్షుడిగా యాదగిరి చెన్నకేశవులును నియమించారు. ఈ మేరకు మంగళవారం బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు కేశవులను అభినందించారు. పార్టీ కార్యక్రమాల్లో యాక్టివ్‌గా పాల్గొంటూ కేసీఆర్ ప్రభుత్వ కార్యక్రమాలను విస్తృత స్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్లి గులాబీ యువ సైన్యాన్ని చైతన్య పరుస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు.

విరబూసిన బ్రహ్మకమలం

విరబూసిన బ్రహ్మకమలం పుష్పం

మణుగూరు టౌన్, మే 27: మణుగూరు పట్టణంలోని గాంధీ బొమ్మ సెంటర్‌లో ఉన్న గంగిశెట్టి బాలకృష్ణ ఇంట్లో 12 సంవత్సరాలకు పూసే బ్రహ్మకమలం వారి ఇంట్లో విరబూసింది. బ్రహ్మకమలం పుష్పాన్ని చూడటానికి చుట్టుపక్కల వారంతా వచ్చి తిలకిస్తున్నారు.

అథ్లెటిక్స్ పోటీలు ప్రారంభం

పోటీలను ప్రారంభిస్తున్న డీఎస్పీ

పాల్వంచ, మే 27: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఒలంపిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక శ్రీనివాస కాలనీ స్టేడియంలో జిల్లా స్థాయి సబ్ జూనియర్ అథ్లెటిక్స్ పోటీలను పాల్వంచ డీఎస్పీ సతీష్ కుమార్ మంగళవారం ప్రారంభించారు. విజేతలకు జిల్లా క్రీడల అధికారి పరంధామరెడ్డి మెడల్స్ అందజేశారు. అసోసియేషన్ జనరల్ సెక్రటరీ మహిధర్, కోచ్‌లు నాగేందర్, మల్లికార్జున్, నాగరాజు, జన్ను గిరిప్రసాద్, అక్బర్, ఎర్రయ్య పాల్గొన్నారు.

విద్యార్థుల్లో సామాజిక చైతన్యం పెంచాలి

మాట్లాడుతున్న డీఎస్పీ సతీష్‌కుమార్

పాల్వంచ, మే 27: విద్యార్థుల్లో సామర్థ్యాలతోపాటు సామాజిక చైతన్యం పెంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని డీఈవో వెంకటేశ్వరచారి, డీఎస్పీ సతీష్‌కుమార్ కోరారు. పాత పాల్వంచలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న బయోలాజికల్ సైన్స్ టీచర్ల శిక్షణ శిబిరంలో వారు మంగళవారం మాట్లాడారు. నూతన టెక్నాలజీ, పోక్సో చట్టం, మానవ అక్రమ రవాణా, డ్రగ్స్ వినియోగం, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. కోర్స్ డైరెక్టర్ పద్మలత తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర బృందం పర్యటన

రోడ్డు నిర్మాణాన్ని పరిశీలిస్తున్న కేంద్ర బృందం

పాల్వంచ రూరల్, మే 27: ఉపాధి హామీ పథకం ఆధ్వర్యంలో మండలంలోని జగన్నాథపురం, రెడ్డిగూడెంలో కొనసాగుతున్న రోడ్డు, ఫాం పాడ్ తదితర నిర్మాణ పనులను కేంద్ర బృందం మంగళవారం పరిశీలించింది. ఈ బృందంలో రాకేష్‌కుమార్, వివేక్‌కుమార్ కేసరి ఉన్నారు. డీఆర్‌డీవో విద్యాచందన, ఎంపీడీవో విజయభాస్కర్‌రెడ్డి, ఏపీవో రంగా తదితరులు పాల్గొన్నారు.

బదిలీ సర్క్యులర్ సవరించాలి

వినతిపత్రం ఇస్తున్న సీఐటీయూ నాయకులు

కొత్తగూడెం సింగరేణి, మే 27: సింగరేణిలో ఇటీవల జారీ చేసిన బదిలీ సర్క్యులర్ సవరించాలని కోరుతూ డైరెక్టర్ (పా) వెంకటేశ్వర్లుకు సింగరేణి కాలరీస్ ఎంప్లాయీస్ యూనియన్(సీఐటీయూ) నాయకులు వినతిపత్రం ఇచ్చారు. దీనిని ఆయన సీఎండీకి, పర్సనల్ జీఎం కవితానాయుడుకు మెయిల్ ద్వారా పంపించారు. ఈ నెల 12వ తేదీన జారీ అయిన ఈ సర్క్యులర్‌పై కార్మికులు, ఉద్యోగులు అసంతృప్తితో ఉన్నారని పేర్కొన్నారు. కలిగించే విధగా ఉందని, కొన్ని సవరణలు చేయాలని పేర్కొన్నారు. రాజకీయ నాయకులు, పైరవీకారుల జోక్యానికి ఈ సర్క్యులర్ ఆస్కారమిస్తున్నదని ఆందోళన వ్యక్తం చేశారు.

వాలీబాల్ పోటీలు ప్రారంభం

ములకలపల్లి, మే 27: మండలంలోని తాళ్లపాయి పంచాయతీ రింగిరెడ్డిపల్లిలో గ్యాంగ్ వార్ యూత్ ఆధ్వర్యంలో మండల స్థాయి వాలీబాల్ పోటీలను మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ మెచ్చా నాగేశ్వరరావు మంగళవారం ప్రారంభించారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మోరంపూడి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్ Classifieds

టెలికాలర్స్ కావలెను

★ప్రముఖ ఎడ్యుకేషనల్ కన్సల్టెన్సీ నందు పనిచేయుటకు మంచి వాక్ చాతుర్యం కలిగిన మహిళ టెలికాలర్ కావలెను. జీతం : 10,000/- నుండి 20,000/-వరకు ఇవ్వబడును. సంప్ర: 8297529999

KMM-

గమనిక

క్లాసిఫైడ్ ప్